## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: మరమ్మతుల కారణంగా రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉప్పర్‌పల్లి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉప్పర్‌పల్లి గ్రామం, ఫోర్ట్‌వ్యూ కాలనీ, పరమారెడ్డి హిల్స్, గోల్డెన్ హైట్స్, జనచైతన్య ఫేజ్-1,2, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, సన్‌రైజ్ హోమ్స్, చింతల్‌మెట్, నాయిడు కాలనీ, సహరాహోమ్స్, ఎంఎం పహాడీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని ఆయన తెలిపారు.

### నేడు మహిళా దినోత్సవం

మణికొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం సాయంత్రం అలిజాపూర్ రోడ్డులోని మహబూబ్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నామని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ మహిళ అధ్యక్షురాలు పి.రూపారెడ్డి, వర్కింగ్ అధ్యక్షుడు కె.ధన్‌రాజ్‌లు తెలిపారు. సాయంత్రం 5గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ పాల్గొంటారని, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

### రానున్న మూడ్రోజులు రైతులు జాగ్రత్తగా ఉండాలి

- వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు వెంకటరమణ

ఏజీవర్సిటీ: హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారు అందించిన సమాచారం ప్రకారం రాబోవు మూడు రోజుల్లో రాష్ట్రంలో చాలా చోట్ల తెలికపాటి, పలు చోట్ల భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని, కాబట్టి రైతులు జాగ్రత్తగా ఉండాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు ఎం.వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా రైతులు చెట్ల కింద నిలబడరాదని, పశువులు, గొర్రెలు, మేకలను చెట్ల కింద ఉంచరాదన్నారు. అదేవిధంగా కోసిన పంటలను ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతానికి తరలించాలని, మార్కెట్లకు తరలించిన ధాన్యం తడవకుండా టార్పాలిన్‌తో కప్పి ఉంచాలని, కోతకు సిద్ధంగా ఉన్న కూరగాయ పంటలను కోసుకోవాలని సూచించారు.

### గాలిదొడ్డి నిర్మాణాలకు నోటీసుల జారీ

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ గాలిదొడ్డిలో ఎలాంటి అనుమతులు లేకుండా పబ్‌లు, అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు, హాస్టల్ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. బుధవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన 'అనుమతులు లేకున్నా.. అక్రమ నిర్మాణాల జోరు' అనే కథనానికి స్పందించిన మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో మున్సిపల్ అధికారులు గురువారమే పనులను నిలిపివేసిన విషయం తెలిసిందే. అక్కడితో ఆగకుండా కొనసాగుతున్న నిర్మాణాలన్నింటికీ శుక్రవారం మొదటి నోటీసులను జారీ చేశారు. వారికి వారం రోజుల సమయం ఇచ్చామని, వారిచ్చే సమాధానాలను చూసి వాటిని కూల్చివేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని టీపీఓ శ్రీధర్‌గౌడ్ తెలిపారు.

## క్రైం కార్నర్..

### ఇసుక లారీ పట్టివేత

శంషాబాద్: ఎలాంటి బిల్లు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రెండు లారీలను ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. పట్టణం, గ్రామీణ ప్రాంతాలకు వివిధ ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న ఇసుక లారీలను పట్టణంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో లారీలో 75 టన్నుల చొప్పున ఇసుక ఉన్నట్లు గుర్తించారు. ఆర్‌జీఐఏ, శంషాబాద్ పోలీసులకు లారీలను అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఎయిర్‌పోర్టులో వ్యక్తి అదృశ్యం


కృష్ణచంద్రనాయక్

శంషాబాద్: వ్యక్తి అదృశ్యమైన ఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. ఒడిశా రాష్ట్రానికి చెందిన కృష్ణచంద్రనాయక్(40) ఎయిర్‌పోర్టులోని నిర్మాణ పనుల్లో కూలీగా పని చేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన బయటకి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. దీంతో కృష్ణచంద్రనాయక్ కోసం చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసిన ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో ఆర్‌జీఏ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి

రాజేంద్రనగర్: విద్యుదాఘాతానికి గురై ఓ గేదె కాటేదాన్ ప్రాంతంలో మృతి చెందింది. కాటేదాన్ అమ్మగార్డెన్ ప్రాంతంలో విద్యుత్ శాఖ గతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిందే కానీ.. చూట్టు కంచెను ఏర్పాటు చేయలేదు. గురువారం నుంచి కురుస్తున్న వర్షానికి ఈ ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతంలో నీరు నిలిచి ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం ఓ గేదె మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు రాగానే విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. స్థానికులు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపి మరమ్మతులు చేపట్టారు.

## దేవాదాయ శాఖ భూమి నుంచి...

# యథేచ్ఛగా ప్రైవేటు రోడ్డు

- మున్సిపాలిటీలో తీర్మానం
- మున్సిపల్ నిధులతో పనులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఈఓ

మణికొండ: ఓ ప్రైవేటు విల్లా ప్రాజెక్టుకు వెళ్లేలా ఏకంగా దేవాదాయ శాఖ భూమిలో నుంచి రోడ్డు వేసేందుకు పనులు ప్రారంభించారు. అదీ మున్సిపాలిటీలో తీర్మానం చేసి మున్సిపల్ నిధులతో వేస్తుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవుల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్.303లో 16.01 ఎకరాల శ్రీవేణుగోపాల స్వామి ఆలయ భూమి ఉంది. అందులో బీరప్ప ఆలయం సైతం ఉంది. సదరు భూమి పక్కనే ఈ మధ్య కాలంలో కీర్తి వెస్ట్ విండ్స్ అనే పేరులో ఓ విల్లా ప్రాజెక్టు వచ్చింది. అందులో రాజకీయ, వ్యాపార ప్రముఖులు విల్లాలను కొనుగోలు చేశారు. ఆ ప్రాజెక్టుకు వెళ్లేందుకు సరైన దారి లేకపోయినా ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న దేవాదాయ శాఖ భూమిలో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. అయినా ఎవరూ అభ్యంతరం పెట్టలేదు.

**ఏకంగా సీసీ రోడ్డుకే తీర్మానం...**

ప్రైవేటు గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టుకు సీసీ రోడ్డు, డ్రైనేజీ తదితర పనులన్నీ బిల్డర్‌లే చేసి ఇవ్వాల్సి ఉంటుంది. అందుకు భిన్నంగా నార్సింగి మున్సిపాలిటీ పాలక కమిటీ బిల్డర్‌తో మిలాఖత్ అయ్యి వారి నుంచి కోట్లలో ముడుపులు అందుకుని ఏకంగా మున్సిపల్ నిధులతో ప్రభుత్వ భూమిలో సీసీ రోడ్డు వేసేందుకు తీర్మాణం చేశారు. ఆ పనులను ఎలాగైనా చేయించాలని అధికారులపై వత్తిడి తెచ్చారు. దీంతో గురువారం రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ చదును చేసే పనులను చేపట్టడంతో విషయం తెలుసుకున్న దేవాదాయ శాఖ ఈఓ నరేందర్ వచ్చి పనులను నిలిపి వేయించారు.

**పోలీసులకు ఫిర్యాదు...**

గురువారం పనులను ఆపించినా పట్టించుకోకుండా తిరిగి శుక్రవారం అదే కాంట్రాక్టర్ మరోమారు పనులను చేపట్టడంతో దేవాదాయ శాఖ ఈఓ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ నిధులతో మున్సిపాలిటీ వారే రోడ్డు వేస్తున్న విషయం తెలుసుకుని మున్సిపల్ కమిషనర్ వి.సత్యబాబుకు రాతపూర్వకంగా అభ్యంతరం తెలిపారు. అయినా రోడ్డు పనులు చేపట్టాల్సిందేనని, తమపై ఆ స్థాయిలో ఒత్తిడి ఉందని మున్సిపల్ కమిషనర్ సదరు ఈఓతో పేర్కొన్నట్లు సమాచారం.

**ప్రజల ఆగ్రహం...**

ఏకంగా ప్రభుత్వ భూములను సైతం ప్రైవేటు వ్యక్తులకు దాసోహం చేసేందుకు ప్రయత్నిస్తుండటం పట్ల మంచిరేవుల గ్రామస్థులతో పాటు నార్సింగి మున్సిపాలిటీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని పనులను అడ్డుకోవడంతో పాటు విల్లా ప్రాజెక్టుకు సాగిస్తున్న రాకపోకలను నిలిపివేయాలని, పాలక కమిటీని రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


ప్రభుత్వ భూమిలో రోడ్డు పనులు చేస్తున్న సిబ్బంది

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..**

తమ శాఖకు చెందిన భూమిలో ప్రైవేటు వెంచర్‌కు రోడ్డు వేయడం నేరం. అలాంటిది మున్సిపల్ నిధులతో మున్సిపల్ శాఖ వారే వేయించడం విడ్డూరంగా ఉంది. అదే విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కు అభ్యంతరం తెలుపుతూ లేఖను అందజేయడంతో పాటు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశా. అదే విషయాన్ని తమ శాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాను. వారి ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం.

– నరేందర్, ఈఓ, దేవాదాయ శాఖ

## హామీని నెరవేర్చిన కాంగ్రెస్ నేత


ఇంటి నిర్మాణం చేసి అందజేసిన శేఖర్‌యాదవ్

శంషాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో నిరుపేద కుటుంబానికి ఇచ్చిన హామీని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ పూర్తి చేశారు. కవ్వగూడ గ్రామంలో ఇల్లు లేని ఓ నిరుపేద కుటుంబానికి ఇంటిని నిర్మాణం చేసి ఇస్తారని శేఖర్‌యాదవ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన సొంత నిధులతో ఇంటిని నిర్మాణం చేసి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా తన పుట్టిన రోజు వేడుకలను కూడా ఆ కుటుంబంతో కలిసి అక్కడే చేసుకున్నారు. సొంతింటి కలలను నేరవేర్చినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### అగ్రి స్టార్టప్‌ల గ్రాడ్యుయేషన్ వేడుక


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఏజీవర్సిటీ: స్టార్టప్‌లు వారు ఎంచుకున్న కార్యచరణ రంగంలో బలమైన ముద్రను కలిగి ఉండాలని, అలాగే ఆచరణీయంగా డైనమిక్ ఉండాలని నాబార్డ్ చిఫ్ జనరల్ మేనేజర్ దేవాసిస్ పాధి అన్నారు. రాజేంద్రనగర్‌లోని నారమ్స్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో స్టార్టప్ పర్యావరణ వ్యవస్థకు మద్దతు ఇచ్చేందుకు అగ్రి స్టార్టప్‌ల మొదటి గ్రాడ్యుయేషన్ వేడుకను నిర్వహించారు.

## విద్యార్థినులు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి


విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్ అందజేస్తున్న సీతారంజిత్‌రెడ్డి

బండ్లగూడ: విద్యార్థినులు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటిస్తూ బలంగా ఉండాలని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డి వెల్లడించారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందించేలా తనవంతు కృషి చేస్తున్నానన్నారు. ఇందులో భాగంగా బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ మెషిన్ అందజేసి మహిళా వైద్యుల సహకారంతో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయం కలగకుండా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

**ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్**

రాజేంద్రనగర్: రంజాన్ మాసం నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా తగు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్ వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లి సబ్‌స్టేషన్‌లో శుక్రవారం శాస్త్రీపురం కార్పొరేటర్ మహ్మద్ ముబీన్‌తో కలిసి ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్సీ ప్రారంభించారు. 316 కేవీ, 315 కేవీ, 160 కేవీ పరిధిలో లోఓల్టేజీతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుందని, ఈ విషయమై స్థానికులు రహమత్‌బేగ్ దృష్టికి తీసుకురావడంతో హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ, మజ్లిస్ శాసన సభ నేత అక్బరుద్దీన్ ఒవైసీల దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి 15 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయించారు. వీటిని ఆయా ప్రాంతాల్లోని బస్తీలు, కాలనీల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్సీ రహమత్‌బేగ్ వెల్లడించారు. రంజాన్ నేపథ్యంలో విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఈ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు, కార్యకర్తలతో పాటు అధికారులు ఉన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మిర్జారహమత్‌బేగ్

### ధోబీఘాట్ నిర్మాణానికి అనుమతులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని రజకులకు సౌకర్యవంతంగా ఉండటంతో పాటు ప్రజలందరికీ అవసరమైన మోడ్రన్ ధోబీఘాట్ నిర్మాణానికి మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్.454/1లో ఎకరం భూమిలో దీన్ని నిర్మించనున్నారు. ధోబీఘాట్ నిర్మాణానికి మున్సిపల్ శాఖ నుంచి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయనున్నారు. ఇదే తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీల్లోనూ వీటి నిర్మాణానికి త్వరలోనే అనుమతులు లభించే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో ఆట స్థలాలు, పార్కులు, టాయిలెట్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, ఓపెన్ జిమ్‌ల తరహాలోనే మోడ్రన్ ధోబీఘాట్‌ను నిర్మిస్తామన్నారు.

### వైభవంగా శివాలయం ప్రారంభోత్సవం


పూజల్లో నాయకులు, భక్తులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ గంధంగూడలోని శివాలయ ప్రారంభోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్, నాయకులు నవీన్, గణేష్, తలారి ప్రేమ్, అంకం శ్రీనివాస్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

### సీబీఐతో విచారణ జరిపించాలి



రాజేంద్రనగర్: నిరుద్యోగ యువతీ యువకుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆటలాడుతోందని రాజేంద్రనగర్ నియోజకవర్గ వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు సదాల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. శివరాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రశ్నా పత్రాల లీకేజీతో ప్రమేయం ఉన్న వారందరిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. దీని వెనుక మంత్రులు సైతం ఉన్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు ఉన్నాయని, ఈ విషయంలో సీఎం కేసీఆర్ వెంటనే స్పందించాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ విషయమై శాంతియుతంగా ఆందోళనకు సిద్ధమవుతుండగా వైఎస్ షర్మిలను గృహ నిర్బంధం చేయడం దారుణమని, రాష్ట్ర ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్‌సీపై ప్రజలకు విశ్వసనీయత పోయిందని, కేసును సీబీఐకి అప్పగిస్తేనే దోషులంతా బయటకు వస్తారని అన్నారు.

### గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

శంషాబాద్: గర్భిణులు బలవర్ధకమైన పోషకాహారం తీసుకోవాలని కౌన్సిలర్ సంజయ్‌యాదవ్ సూచించారు. 19వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం, అన్నప్రసాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు చీరలను అందజేశారు. కార్యక్రమంలో సంగీత, శ్రీధర్‌యాదవ్, శంషాబాద్ సెక్టార్ సూపర్‌వైజర్ భిక్షపమ్మా, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, లక్ష్మి, పల్లవి, కలమ్మ, చందుయాదవ్, శ్రీకాంత్, అభిషేక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### 'లీకేజీ వ్యవహారం పెద్ద స్కాం'



రాజేంద్రనగర్: టీఎస్‌పీఎస్‌సీలో అవినీతి బాగోతం రోజు రోజుకు బయటకు వస్తోందని, లీకేజీ వ్యవహారం చాలా పెద్ద స్కాం అని, ప్రభుత్వం దీనిని దాచిపెట్టేందుకు ప్రయత్నిస్తుందని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాటేదాన్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రూప్-1, జూనియర్ లెక్చరర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ పరీక్షలు రద్దు చేశారంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుందన్నారు. గతంలో టీఎస్‌పీఎస్‌సీ జరిపిన పరీక్షల మీద ప్రజలకు అనుమానాలు కలుగుతున్నాయన్నారు. లీకేజీ మీద ప్రశ్నించిన బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, ఈటల రాజేందర్ ఇతర నాయకులను అరెస్ట్ చేసినంత మాత్రాన వదిలిపెడతాం అనుకోవద్దని, అసలు దోషులెవరో తేలే వరకు తమ ఉద్యమం ఆగదన్నారు. సరైన దర్యాప్తు జరిపి దోషులకు శిక్ష పడేలా చేయకుంటే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

### కార్పొరేటర్ పర్యటన

రాజేంద్రనగర్: అభివృద్ధి పనుల్లో భాగంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ, బృందావన్ కాలనీలో బాక్స్ డ్రైనేజీ నాలా పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలా విస్తీర్ణం, పొడువులో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడికే జనార్దన్, అడికే శివశంకర్, మధుకర్, రాజేందర్‌సింగ్, పవన్, చిన్న, ధశంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వీధి కుక్కల కోసం నీటి కుళాయిల ఏర్పాటు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ వీధి కుక్కలకు తాగడానికి నీటిని అందించేందుకు కుళాయిలను ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి వెల్లడించారు. బండ్లగూడలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వీధి కుక్కలకు ఆహారం లేకపోయినా ఉంటాయే కానీ.. తాగేందుకు నీరు లేకపోతే అవి తట్టుకోలేవని, నీరు లేకపోవడంతోనే అవి మనుషులపై దాడి చేస్తుండవచ్చని చెప్పుకొచ్చారు. కార్పొరేషన్ పరిధిలోని కుక్కలు తాగేందుకు నీటి సౌకర్యంతో పాటు 3650 కుక్కలకు కు.ని. శస్త్ర చికిత్స నిర్వహించి వ్యాక్సినేషన్ చేశామన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడకు చెందిన మహేందర్ ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అతడి ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగానే ఉండటంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా ఆయనకు పథకం ద్వారా ఆర్థిక సాయంగా నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సీఎం సహాయనిధికి సంబంధించిన చెక్కును లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బి.శ్రీరాములు, కౌన్సిలర్ వసంతరావు, నాయకులు జి.నరేందర్, ఎ.కుమార్, శ్రీకాంత్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

### కల్యాణ మండపం ప్రారంభం


కల్యాణ మండప ప్రారంభోత్సవంలో ఆలయ కమిటీ

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ షేక్‌పేట డివిజన్ సరిహద్దులో భాగ్యలక్ష్మి కాలనీలో ఉన్న శ్రీకనకదుర్గాదేవి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆలయ కమిటీ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు బాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వేంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవుల గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడ్రోజుల పాటు జరిగే ఈ పూజల్లో భాగంగా శుక్రవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొనగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

### బీజేపీ శ్రేణుల సంబరాలు



రాజేంద్రనగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం సాధించిన సందర్భంగా రాజేంద్రనగర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పొన్నముని మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆరాంఘర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున టపాకాయలు కాల్చి మిఠాయిలు పంచుతూ విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, మల్లారెడ్డి, కొమురయ్య, వేణుగోపాల్, బైక్ శ్రీధర్, రాజశేఖర్, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



## సీబీఐటీలో అంతరిక్షంపై అవగాహన

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఇస్రో జైత్ర యాత్రలో భాగంగా శుక్రవారం అంతరిక్షంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో మాజీ శాస్త్రవేత్త వై.శివప్రసాద్ అంతరిక్షం, చంద్రయాన్-1, చంద్రయాన్-2, మంగళయాన్, అంతరిక్ష నౌకల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. 2030 నాటికి మన దేశం సొంత స్పేస్ హౌస్ ఏర్పాటు చేసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా అంతరింక్షంపై క్విజ్ పోటీని నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైఏస్పార్ మెథో ఫక్షరమ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ జి.శాంతమూర్తి, డీజీ క్వెష్ట్ చైర్మన్, ఎండీ కె.బాసిరెడ్డిలతో పాటు నిర్వహణ కర్త రామదాసు, ప్రొఫెసర్ వై.రమాదేవి, ఎన్.రమాదేవి, డాక్టర్ పద్మావతి రెడ్డి, కళాశాల పీఆర్‌ఓ జీఎస్‌ఆర్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.


అంతరిక్షయానం గురించి వివరిస్తున్న శివప్రసాద్

## సకాలంలో కంటి సమస్యలకు చికిత్స చేయించుకోవాలి


శిబిరాన్ని ప్రారంభించిన చైర్మన్ నరేందర్‌ముదిరాజ్, కౌన్సిలర్లు

మణికొండ: కంటి సమస్యలను సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే కంటి సమస్యలు తొలగిపోతాయని, ఇందు కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు భాగ్యలక్ష్మి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని కౌన్సిలర్ ఎల్.వందన నగేష్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లారెడ్డి, కౌన్సిలర్ కె.లక్ష్మీరానాయణ, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, భాగ్యలక్ష్మి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజలింగం, హుడా కాలనీ అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు దేవరాజుల నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### హార్టికల్చర్ ఆఫీసర్ పరీక్ష తేదీని రద్దు చేయాలి

ఏజీవర్సిటీ: టీఎస్‌పీఎస్‌సీలో పరీక్ష పేపర్ల లీకేజీ జరుగుతున్న క్రమంలో ఏప్రిల్ 4 తేదీన జరిగే హార్టికల్చర్ ఆఫీసర్ పరీక్ష పేపరు కూడా లీక్ అయ్యిందని భావిస్తున్నామని, కనుక ఆ యొక్క పరీక్ష తేదీని రద్దు చేయాలని శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయం విద్యార్థి నాయకుడు సంగారెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు జరిగిన లీక్‌ల పర్వంలో 5 పేపర్లు ఉన్నట్లు తెలిసిందని, అందుకే ఉద్యాన అధికారి పరీక్ష పేపర్‌ను రద్దు చేసి కొత్త పేపర్ తయారు చేసి కొత్తగా తేదీని ప్రకటించాలని కోరారు.

### బీఎస్‌పీ నాయకుల ముందస్తు అరెస్టు



రాజేంద్రనగర్: టీఎస్‌పీఎస్‌సీలో ప్రశ్నాపత్రాల లీకేజీ నేపథ్యంలో బీఎస్‌పీకి ఇచ్చిన పిలుపు మేరకు టీఎస్‌పీఎస్‌సీ కార్యాలయం ముట్టడి నేపథ్యంలో శుక్రవారం పెద్ద ఎత్తున ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందు జాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నారు. బండ్లగూడ ప్రాంతంలోని బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను గృహ నిర్బంధం చేయగా ఆయనకు మద్దతుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలను రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉదయం నుంచే వారిని స్టేషన్‌కు తీసుకువచ్చి నిర్బంధించి సాయంత్రం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.